కథా నిలయం
శ్రీకాకుళం

# కుసుమయజ్ఞం

గోదావరి కావల ఒక ఊరు. నేటికీ బతికున్న ఊరది. ఆ వూళ్లో వేణుగోపాలుడి ఆలయం. ఆలయాని కెదురుగా ఓ ఇరుకు సందు. నూరేళ్ళ క్రితం, బులిబాబు దొరగారు ఆ ఆలయం కట్టించినప్పుడే, ఆ సందూ వెలసింది.

వేణుగోపాలుడి సేవలకోసమని మూడిళ్ళవాళ్ళకి మాన్యాలిచ్చి, ముగ్గురు సానుల్ని తీసుకొచ్చి బులిబాబుగారే ఆ వీధికి శంకుస్థాపన చేశారట. మూడు గడపలతో పుట్టిన ఆ వీధి దొండపాదులా పాకి ఇప్పుడు పాతిక గడపల వీధిగా రూపొందింది.

బులిబాబుగారు పోయినా వేణుగోపాలుడున్నాడు.

మాన్యాలు పోయినా సానులు ఉన్నారు.

ఆ వీధి పగలంతా ఆకురాలిన చెట్టు. చీకటి పడేకొద్దీ పూసిన దిరిసెన. మసక చీకటి వీధినిండా అలుముకుంటె, చౌకబారు సెంటు వాసనలు, మత్తెక్కించే మల్లెపూల పరిమళాలు గాలి నిండా పులుముకుంటాయి.

వీధి గుమ్మాలలోంచి రోడ్డుమీదకి పడే వెలుగుల్లో, గుమ్మాలలో నిలబడిన ఆకారాల నీడలు. ఆ నీడలు వీధిన నడిచేవాళ్ళ కాళ్ళకిందపడి నలిగి పోతూ వుంటాయి. కొందరి కాళ్ళకి అడ్డుపడి పలుకరిస్తాయి. ఆ

వీధికి అటూ యిటూ అలాంటి గుమ్మాలే. ఆ గుమ్మాలలోని ఆకారాలు వీధిన పోయేవాళ్ళని ఆహ్వానిస్తోన్నట్టు నిలబడతాయి.

మసక చీకట్లో వీధిన నడిచే వాళ్ళకి గుమ్మాలలో నిలబడిన ఆకారాలు అందంగా, మెరుస్తూ, సుఖాన్ని అంగట్లో వేలాడతీసినట్లు అగుపిస్తాయి. చుట్టుపక్కల పదివూళ్ళనుండి, పదిమైళ్ళ దూరంలోవున్న పట్టణంనుంచి చీకటిపడేసరికల్లా, రకరకాలు సైకిళ్ళు, స్కూటర్లు, కార్లు వచ్చి నిలుస్తాయి. ఆ చీకట్లో రెండు మూడు గంటలసేపు నారిగాడికి, సుబ్బారావుకి, సూర్జాన్‌కి వరాలిచ్చే బాబాలకంటె పెద్ద గిరాకీ.

క్రమక్రమంగా ఒక్కొక్క గుమ్మం తలుపే మూసుకుంటుంది. అయినా ఎప్పుడో వాడివడిలిపోయిన నీడలు నీరసంగా రాత్రి పన్నెండు ఒంటిగంటదాకా నిలబడి, కాళ్ళులాగి, గడపలో చతికిలపడి కునుకు తీస్తాయి. ఏదైనా అలికిడైతే, మగతనిద్రలోంచి వులిక్కిపడి లేచి, లేని చురుకుతనాన్ని, నవ్వుని, వయ్యారాన్ని తెచ్చిపెట్టుకుని రేపటి ఆకలి తీరడం కోసం నటిస్తాయి. రెండుకో మూడుకో వాలాయి పడి ఆ తలుపులూ మూసుకుంటాయి చివరకి.

'నా తలుపులూ తొమ్మిది కొట్టక ముందే మూసుకునేవి నా వయసులో. ఎప్పటికైనా యీ తలుపులూ నా తలుపుల్లా అర్ధరాత్రిదాకా తెరచుకుని వుండాల్సినవే' అనుకుంటూ ముప్పయి యేళ్ళయినా నిండని వెంకటసూరి, ఆఖరికి నీరసంగా తలుపులు మూసుకుని, గ్లాసుడు మంచినీళ్ళు తాగి, పక్కలేని నులకమంచం మీదకి కళేబరాన్ని వాలుస్తుంది.

వూళ్ళోని వాళ్ళు, పొరుగూళ్ళవాళ్ళు కూడ ఆ వీధికి భోగం వీధి అని ఏనాడో నామకరణం చేశారు. ఆ వీధిలో కుడిచేతిపక్క వరుసలో నదరుగా ఆనే మొదటి యిల్లు విరజాజిది. విరజాజికి కన్నెరికమై మూడేళ్ళు కావస్తోంది. నవనవలాడుతూ చూసినవాడికి గిలిగింతలుపెట్టేలా వుంటుంది విరజాజి. అందుకే యీ మూడేళ్ళలోనూ ఏనాడూ బేరంకోసం తలుపులు తెరచుకుని కూర్చోవలసిన అవసరం కలుగలేదు ఆమెకి.

ఉన్నట్టుండి ఓరోజున విరజాజికి నెలతప్పిందన్న వార్త ఆ వీధంతా పాకింది. ఆ ముచ్చటకి నోచుకోని ఆ యీడు వాళ్ళు అసూయ పడ్డారు. వెంకటసూరి మాత్రం 'అయ్యోపాపం!' అనుకుంది. మన నొప్పక సాయంత్రపువేళ విరజాజి యింటికి వెళ్ళింది వెంకటసూరి.

'యేమే పిల్లా! నే విన్నమాట నిజమేనా?'

'నిజమే పిన్నీ' అంది విరజాజి సిగ్గుపడుతూ.

'యీ పిల్లాజల్లా ముచ్చట్లు మనలాంటాళ్ళ కెందుకే? సంసార్లుకి చెల్లిందిగాని.'

'అదేంమాట పిన్నీ? మనం మాత్రం మనుషులంగా(వా? ఏ ఆడదానికి తల్లి కావాలని వుండదు చెప్పు?'

'అదికాదే వె(్రిమొగమా! కానుపుకి ముందో రెండు నెలలు, తరువాత కనీసం ఓ నెల్లాళ్ళపాటేనా మన ముఖం ఎవరు చూస్తారే? అందుకే లంజకి పిల్లతెగులన్నారు.'

'నీ చాదస్తంకాని, ఆయనల్లాంటి మనిషికాదు పిన్నీ. ఆదుకుంటారన్న నమ్మకం వుందినాకు. అది కాకపోయినా మన కాలూ చెయ్యా వంగేటప్పటికి యేదో ఒక నలుసు అడ్డు వుంటే నయం కాదటె. అప్పుడు మనకి పిల్లలు లేరని, ఎవరిపిల్లనో కొనుక్కొని ఈ రొంపిలోకి దింపి పాపం కట్టుకొనేకంటే మనమే బాధపడి ఓ పిల్లని కంటే ముందు ముందు యిబ్బందుండదు చూడు.' అని తన మనసులోని ఆలోచనను బయటపెట్టింది విరజాజి.

'సరేనే పిల్లా నీ యిష్టం. వెనుక పెద్దదిక్కులేని దానివికదా అని నాకు తోచినమాట చెప్పాలని వచ్చాను. యిప్పటికైనా మించిపోయింది లేదు. పచ్చి బొప్పాసికాయ కళ్ళుమూసుకుని మింగావంటే మర్నాటికి అంతా కడిగేసినట్టు అయిపోతుంది.'

'వద్దులే పిన్నీ నాకెందుకో ఆ పని యిష్టంలేదు.'

అయితే సరే. కాస్త వళ్ళుదగ్గరెట్టుకుని నాలుగు డబ్బులు చేసుకో.' మోజున్నన్నాళ్ళే. మోజు చప్పబడితే నీ ముఖం చూసేవాడుండడు. యీ

చిట్టిబాబైనా అంతే మరో బుచ్చిబాబైనా అంతే.' తన అనుభవాన్ని వివరించి వెళ్ళిపోయింది వెంకటసూర.

విరజాజికి కన్నెరికం పదిహేనేళ్ళు నిండకముందే జరిగిపోయింది. అప్పటికి నాలుగైదు కన్నెరికాలు చేసిన ఓ నలభైయేళ్ళపంతులు వచ్చి, ఒక వేయిరూపాయలు ఖర్చుపెట్టి, విరజాజికి కన్నెరికంచేసి మూడు రాత్రులుండి వెళ్ళిపోయాడు, ఆ ముచ్చట చూసి. ఏడాది తిరగకముందే తల్లి కన్నుమూసింది. ఆ తరువాత మూడేళ్ళలోను, తను ముగ్గురు సరసులతోనే గడిపింది. ఏదో ఒక్కడితో బతుకు వెళ్ళమార్చుకోవాలన్న కోరికతో, వచ్చిన సరసుడితో మనస్ఫూర్తిగా కాలం గడిపేది. వాడిని దోచుకోవాలన్న కోరిక ఆమె కెప్పుడూ కలగలేదు. వున్నవాడు పది కాలాలపాటు వస్తూ పోతూవుండి తనముప్పుగడిపితే చాలనుకొనేది.

అయినా వచ్చినవాడల్లా ఆర్నెల్లో ఏడాదో వుండడం మోజు తగ్గగానే జారుకోవడం, కొత్తవాడికోసం వెతుక్కోవటం, యిలాగే యీ మూడేళ్ళు గడిచిపోయాయి.

తను వేణుగోపాలుని ఆలయంలో కృష్ణజయంతికి కట్టే మేజువాణీలో గజ్జెకట్టి ఆడినప్పుడు, పెళ్ళిళ్ళకి పొరుగూర్లకి మేళాలకి వెళ్ళినప్పుడు తన అందాన్ని ఆటని పాటనిచూసి చాలామంది లొట్టలేసేవారు. ఒక్కరాత్రి తనతో గడిపితే చాలనుకున్నవాళ్ళు వూళ్లోనూ, పొరుగూర్లలోనూకూడ వున్నారు. తనుమేళాలకి వెళ్ళొచ్చిన మర్నాడు అనేకమంది రసికులు తనకోసం కబురంపేవారు. ఎంతడిగినా యిస్తామని ఎరవేసేవారు. అయినా తనెప్పుడూ వున్నవారిని కాదని పైవాళ్ళని తాకనీయలేదు. తనకందుకే సాటివాళ్ళలో కొంత పరువుండేది. అయినా కొందరు కిట్టనివాళ్ళు తనని పిచ్చిదానిగా జమకట్టారు. తనకి ప్రేమపిచ్చన్నారు. ఒకడు వస్తూపోతూ వుండగా మరొకడికి వప్పుకోకుండా నీతిగా బతకడమే దీని కారణము. ఆ కారణంగానే తనీ మూడేళ్ళలోను ఏమీ సంపాదించలేకపోయింది. పైగా చిట్టిబాబుగారికి ముందు వచ్చిన రాజు చివరిరోజున రేడియో బాగుచేయించుకొస్తానని పట్టుకెళ్ళి అమ్మేసుకున్నాడు.

పక్కూరి మునసబుగారింట్లో పెళ్ళి సమయంలో చిట్టిబాబుగారితో తనకి పరిచయంఅయింది, ఆయనకలిసి అప్పుడే నాలుగునెలలు కావస్తోంది. పెద్దగా పెట్టుపోతలు లేకపోయినా, తనకేలోటూ లేకుండా చూస్తూనే వున్నారాయన. చిట్టిబాబుగారు పెద్దకుటుంబంలోనివాడు. మంచిమనిషి. వున్నవాడు. తనేమీ ఆయనకి బరువుకాదు. తనముప్పూ ఆయన గుప్పుతాడన్న నమ్మకం తనకుంది. తను వెంకటసూరి మాటలువిని ఏ అఘాయిత్యం ఒయ్యనక్కరలేదు. అయినా ఆయనొచ్చాక ఆయనతోకూడా ఓ మాటంటాను. ఏమంటారో చూస్తాను అనుకుంది విరజాజి.

ఇంతలో చిట్టిబాబు తలుపుతట్టాడు. చిట్టిబాబు గొంతు విప్పి పిలవడు. ఓ నౌకరుతో కలసివచ్చి తలుపు తడతాడు. అనవాలు ప్రకారం 'వస్తున్నా' అంటూవెళ్ళి తలుపుతీసింది.

లోపలికెళ్ళి మంచంమీద ఠీవిగా వాలాడు చిట్టిబాబు. నౌకరికి చాపదిండు యిచ్చి వరండాలో పడుకోమని తలుపేసివచ్చి, కాళ్ళని వళ్ళోకి తీసుకొని 'నిన్నా మొన్నా రాలేదేం? కంటిమీద కునుకులేదు నాకు." అంది విరజాజి కాళ్ళవేళ్ళు విరుస్తూ.

మొత్తానికి నువ్వూ సాని టక్కులు నేర్చావు.'

'చాల్లేండి. నిజం చెప్పినా నమ్మరుమీరు.' అంది విరజాజి పెదవులు బిగిస్తూ.

'నాకుమాత్రం నిద్దరట్టిందటె? మీ అక్కయ్యగార్ని ఓ సారి డాక్టరమ్మకి చూపించాల్సివచ్చి పట్నానికెళ్ళాను. అంచేత రాలేకపోయాను.' అన్నాడు చిట్టిబాబు విరజాజిని దగ్గరకు తీసుకుంటూ.

'డాక్టరమ్మ దగ్గర కెందుకు?'

'ఉన్నట్టుండి కడుపులో పోట్లొచ్చాయి. ఏడోనెలని అలారావడంతో కంగారుపడి డాక్టరుకి చూపించుకోవాలంది.'

'అదా సంగతి. యిన్నాళ్ళూచెప్పరేకాదూ!'

'చెప్పడానికేముందే? అక్కడ యిబ్బందిమూలానేకదూ నీ దగ్గరకొచ్చి వాలింది.' అని బుగ్గమీద చిటికేశాడు చిట్టిబాబు.

'యిక్కడ యిబ్బందొస్తే మరో చోటికిపోయి వాలుతుండగా మోసు యీ గోరింక.'

'ఏమిటేమిటి సంగతి !' అని దగ్గరకు తీసుకున్నాడు విరజాజిని.

ముఖాన్ని చేతులతో దాచుకుని 'నాకూను' అంది సిగ్గుతో.

'ఎన్నో నెల ?'

•మూడూ వెడతాయి యింకో వారంలో.

'అదా సంగతి ? ఏమిటా యిలా రంగొస్తున్నావ్ అనుకున్నాను.' అని బుగ్గమీద కాటేశాడు చిట్టిబాబు.

విరజాజి కోపంగా అరిచింది. యింతలో ఎవరో తలుపు తట్టారు.

'ఎవరు ?' అంది విరజాజి.

'నేను' సూర్జాన్ సమాధానమిచ్చాడు.

'వస్తున్నానుండు' అంటూ వెళ్ళి తలుపు తీసి 'ఏరా ?' అంది.

మంచంమీదున్న చిట్టిబాబును కాస్త బెదురుగా చూసి, 'దండాలు బావగారు' అని, 'కాస్త అన్నంవుంటె పెట్టేఅక్క. ఆకలిగావుంది.' అన్నాడు సూర్జాన్.

'రా ! అన్నం పులుసు యిస్తాను. పట్టుకెడుదువుగాని' అని వంట గదిలోకి తీసుకెళ్ళి అన్నం పులుసు గిన్నెలోపెట్టి యిచ్చింది.

నిజానికి సూర్జాన్ వచ్చింది అన్నంకోసంకాదు. విరజాజి అంటే సూర్జానికి చిన్నప్పటినుంచీ ప్రాణం. ఆమెను పువ్వులాచూసుకుంటాడతను. విరజాజి మేళంలో గజ్జకడితే డోలక్ వాయించినట్లు, మరెవరు గజ్జకట్టినా వాయించడు సూర్జాన్. వాళ్ళకి ఏవిధమైన రక్తసంబంధం లేకపోయినా వాళ్ళిద్దరిమధ్యావున్న అప్యాయత, అభిమానం బలమైనది. నోరారా 'అక్కా' అని పిలుస్తాడు సూర్జాన్ ఎప్పుడూ విరజాజిని. ఆమెకి నెలతప్పిందన్న వార్తవిని ఓసారి పలకరించి పోదామనివచ్చాడు. సింహంలా చిట్టిబాబు ఎదురవడంతో కోర్కెని మనసులోనేపాతేసి అన్నం అడుక్కుని చక్కాపోయాడు.

అయినా చిట్టిబాబు కళ్ళు అనుమానంగానే చూశాయి.

'యేవే! ఎవరైనా వుంటేనే అక్కా అంటాడా నిన్నూ? ఒంటరిగా వున్నా అక్కాఅనే అంటాడా?' అన్నాడు వుండబట్టలేక చిట్టిబాబు.

ఆ మాటలు యీటెల్లా గుండెలకి తాకినా, నవ్వుతూ 'బలేవారే నంటి ముసలాయనలా అంత అనుమానఁ వేమిటి? వాడు మీఅంత అందగాడనా? వున్నవాడనా? రసికుడనా? ఏంచూసి వాడిని నేను వరించడం,' అంది విరజాజి.

ఎంత అవమాన్నైనా అలా దిగమింగి, నవ్వుతూ సహించి, సర్దుకుపోవడం ఆ వృత్తి ధర్మం. ఎదుటివాడు యింద్రుడని పొగడడం ఆ వృత్తినీతి.

విరజాజికి ఏడు నెలలు నిండబోతున్నాయి. నిండుకుండలా అగుపిస్తోంది. ఓనాడు దిగాలుబడి గుమ్మంలో నిలబడింది.

దారినపోతున్న అప్పులిచ్చే అంజయ్య, గుమ్మంముందు ఆగి, 'యేమేపిల్లా యిసుకపర్రలో పువ్వులు పూయించేత్తన్నావ్. ఏటీకత?' అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

'చాల్లెండి ఎప్పుడూ అలాంటి మాటలే' అని లోపలి కెళ్ళిపోయింది విరజాజి.

అంజయ్యకి వ్యాపారం అంతా ఆవీధిలోనే. రూపాయకి పావులా వడ్డీకి అప్పులిస్తాడు. పైగా మామూలుకింద అప్పు తీసుకున్న ప్రతిసాని తనతో ఓ రాత్రి గడపడం రివాజు. కాదంటే అప్పు లేదు. అచ్చోసిన ఆబోతులా ఆ వీధిలోవాళ్ళ రక్తంమీద అలా బతికేస్తాడు అంజయ్య. బొల్లి పెదవులు, మాసిపోయిన గావంచా, చేతిలో గుడ్డసంచి, గుండెలనిండా సగం నెరసిన వెంట్రుకలు, జిడ్డుముఖం, నవ్వితే వికృతంగా అగుపించే బంగారపు పన్ను, పిప్పళ్ళ బస్తాలాంటి నల్లని కళేబరం— చూస్తే ఎవరికైనా రోత పుడుతుంది. అయినా సరిపెట్టుకుని, వాడి అవసరంతీర్చి, తమ తమ అవసరాల్ని గడుపుకుంటూ వుంటారు ఆ వీధిలోనివాళ్ళు.

3)

లోపలికిపోయిన విరజాజినిచూస్తూ 'యిన్నాళ్ళకు తన కోరికతీరే రోజు లొస్తున్నాయి.' అనుకున్నాడు మనస్సులో అంజయ్య. తనలో తను నవ్వుకుని ముందుకెళ్ళిపోయాడు.

లోపలికి వెళ్ళిన విరజాజి మంచం మీద నడుంవాల్చింది. మంచం కోడుకి నిన్న తగిలించిన మల్లెలదండ వాడిపోయి నీరసంగా వ్రేలాడుతోంది. నిన్నరాత్రి తలలో సింగారించుకున్న పూలదండ అది. చిట్టిబాబు వచ్చేసరికి వాడిపోతుందేమోనని పడుకోబోయేముందు పూలచెండు తీసి మంచంకోడుకు తగిలించింది విరజాజి. ఆ వాడిపోయిన పూలచెండును చేతులోకి తీసుకుంది విరజాజి. 'నిన్న నవనవలాడుతూ యీ దండవున్నప్పుడు ఎక్కడనలిగిపోతుందోనని తల నుంచి తీసి అపురూపంగా చూసుకున్న దండనీ నడిరోడ్డుమీదకి విసిరేస్తాను. నా బతుకూ అలాగే వుంది' అనుకుంది విరజాజి.

చిట్టిబాబు వారంరోజులనుంచి రావడంలేదు. తన కప్పుడే ఎనిమిదవ నెల రాబోతోంది. రెండు మూడు నెలలనుంచే చిట్టిబాబు రాకపోకలు తను వట్టిమనిషిగా వున్నప్పుడున్నట్టు లేవు. నిత్యం తనను చూడకుండా వుండలేనని బాసలు, ప్రమాణాలు చేసిన మనిషి నాలుగు రోజులకు ఐదు రోజులకు ఓసారైనా దర్శనం యివ్వడం కష్టమైపోతోంది. తన మనసేమీ యీమధ్య బాగోడంలేదు. ఏదో వంటరితనం, భయం పిచ్చిపిచ్చి ఆలోచనలు తను బతకనేమోనన్న ఆందోళన తనని వెంటాడుతున్నాయి. ఆప్యాయంగా ఆదుకునేవాళ్ళు, ఆదరించేవాళ్ళు, అభిమానం చూపేవాళ్ళు కావాలనిపిస్తోంది తనకి. కాని వాటికి తను నోచుకోలేదు. తను పురుడు పోసుకోవడంకోసం రెండువందల రూపాయలు అడిగిన నాటినుంచి, చిట్టిబాబు ప్రవర్తన తనకి వింతగా తోస్తోంది. మాటవరసకైతే యిస్తానన్నాడుగాని, అవసరం వచ్చినప్పుడు చూద్దాంలే, ప్రస్తుతం చేతిలో డబ్బులేదని వాయిదా వేశాడు. ఆ రోజునుంచే రాకపోకలు మరీ సన్నగిల్లాయి. రాత్రిళ్ళు గడవడం మరీకష్టంగా వుంది తనకి. ఏ అర్ధరాత్రివేళకో ఆ సూర్జాన్ వచ్చి సాయం పడుకోబట్టిగాని, లేకపోతే తనకి నిద్రకూడ కరువయ్యేది.

ఈరోజు ఆయన వచ్చేదాకా నమ్మకం లేదు. పిల్లవాడికి బారసాల చేసుకుని తల్లిని పిల్లాడిని తీసుకురావడానికి అత్తవారింటికి వెళ్ళాడని తెలిసింది తనకి. అందుకే వారంనుంచి రావడంలేదని తను సరిపెట్టుకుంటోంది. అత్తవారింటికి వెళ్ళినవాడు యీరోజున మాత్రం వస్తాడని నమ్మకం ఏమిటి? అది కాకపోయినా తనతో ఆయనకిప్పుడేం పని? యిలా తనలో తను సతమతమౌతూ నిద్రపోయింది విరజాజి.

ఇంతలో 'అక్కా' అంటూ సూర్జాన్ వచ్చాడు. విరజాజిని లేపడం యిష్టంలేక చాపపరుచుకుని, తలుపులువేసి పడుకున్నాడు సూర్జాన్. చిట్టిబాబుగారు రానిరోజులలో సూర్జాన్ యీమధ్య సాయం పడుకుంటున్నాడు. విరజాజికి ధైర్యం చెబుతున్నాడు. రోజూ వాళ్ళిద్దరే కష్టం సుఖం చెప్పుకుని పడుకుంటున్నారీమధ్య. కాని యీవేళ విరజాజి నిద్రపోవడంతో సూర్జాన్ కూడ నిద్రపోయాడు.

రాత్రి పంటిగంట దాటింది. తలుపు తట్టిన చప్పుడు. విరజాజి ఉలిక్కిపడి లేచింది. ఎంతో సంతోషంగా రెండడుగులలో తలుపు దగరకి వెళ్ళి తలుపు తీసింది. 'వచ్చారా! రండి' అంటూ చిట్టిబాబుని ఆహ్వానించింది మనసారా. చిట్టిబాబుతో వచ్చిన నౌకరు బయటే నిలబడ్డాడు. చిట్టిబాబు లోపలికి అడుగుపెట్టాడు. అడుగుపెట్టడమే తడవుగా చాపమీద నిద్రపోతూన్న సూర్జాన్ని ఉద్దేశించి 'వీడెవడు?' అన్నాడు.

'సూర్జాన్' అంది విరజాజి. లేపబోయింది.

ఉన్నట్టుండి కాలుతో ఫెడీమని తన్నాడు చిట్టిబాబు, నిద్రపోతున్న సూర్జాన్ని. సూర్జాన్ కంగారుగా లేచాడు.

చిట్టిబాబు వాడిజుట్టు పట్టుకొని 'ఏరా దొంగవెధవ. నేనుంటే అక్కా అంటావా? నే లేనప్పుడు పక్కలోకి చేరతావా?' అంటూ కాలిజోడుతీసి ఎడాపెడా వాయించడం మొదలెట్టాడు నోటికొచ్చినట్టు తిడుతూ.

విరజాజి చూడలేక యిద్దరిమధ్యకి వెళ్ళి 'వాడు నన్ను మనసారా అక్కా అని పిలుస్తాడు. వాడిమీద నా మీద లేనిపోని నింద వేయకండి' అంటూ చిట్టిబాబును బతిమాలింది.

చిట్టిబాబు 'బ్రోకరు గాడికి వరసా వావీ యేటే. నీవు నాకు నీతులు చెబుతున్నావా ? ఓ అబ్బకి పుట్టినోళ్ళటే మీ రిద్దరు ?' అంటూ విరజాజిని గెంటేశాడు. విరజాజి తూలి మంచం పట్టెమీద పడింది.

సూరాన్ చేతులు జోడించి 'బాబూ ? అది వతిమనిషికూడాకాదు. దాన్ని ఏమీ చేయకండి బాబు. నమ్మినోళ్ళని మోసం చేయడం దానికి సేతకాదు. అది నమ్ముకున్నోళ్ళే దాన్ని మోసం చేశారు. కావాలంటే యీ సాయంకి రాకుండానే దూరంగా పోతాను, దాన్నిమాత్రం యీ సమయంలో దిక్కులేనిదాన్ని సెయ్యకండిబాబు' అంటూ మూలగాఉన్న డోలక్ తీసుకుని బయటికి పోయాడు.

చిట్టిబాబుకి యింకా కసితీరక విరజాజిమీదికి వెళ్ళి, 'ఏవే ? చిట్టిబాబు ముండ, డోలక్‌కొట్టేవాడితో సంబంధం పెట్టుకుందంటే నా పరువేం కావాలె. పదిమందిలోనూ నా పరువు తీద్దామనా ? అసలు నీలాంటి దానింట్లోకి అడుగుపెట్టడం నాదే పొరబాటు' అని చివరిసారిగా కాలితో తన్ని బయటికి పోబోయాడు.

పోబోతూన్న చిట్టిబాబు కాళ్ళని కౌగలించుకుని 'నామీద అనవసరంగా నిందవెయ్యకండి. నామాట వినిపించుకోండి' అని ఏదో చెప్పబోతూ ఆపడానికి ఎంతో ప్రయత్నించింది కాళ్ళావేళ్ళాపడి; యివేవీ లెక్కచెయ్యకుండా ఆమెని జుట్టుపట్టుకుని ఓ గెంటు గెంటి, విదలించుకుని బయటికెళ్ళిపోయాడు చిట్టిబాబు.

విరజాజి కన్నీళ్ళు నౌకరుని కదిలించాయి. కాని చేయగలిగిందిలేక చిట్టిబాబువెంట నౌకరూ వెళ్ళిపోయాడు. విరజాజి భోరున ఏడ్చింది; రాత్రంతా కన్నీళ్ళతోనే గడిపింది.

బయటికి వచ్చిన తరువాత 'ఆ అమ్మి సెప్పే వూసుకూడ యినాల్సిందయ్యా' అన్నాడు నౌకరు.

'ఏంట్రా వినేది ? అది యిప్పుడెవరికి కావాలిరా ? బాన కడుపూ అదీను. ఇప్పుడు జాలిపడితే మనకి సుఖంలేదు సరికదా, పురుళ్ళు పుణ్యాలూ మన నెత్తిన పడతాయి. సానికి పెట్టినడబ్బూ గోడకివేసిన

వెల్లా తిరిగిరావురా సన్నాసి, ఈ రంగంలో మనతల నెరిసిపోయింది, పదపద' అని తన అనుభవాన్ని వివరించి మరికాస్త చురుగ్గా ముందుకు సాగిపోయాడు చిట్టిబాబు. నౌకరుకి ఆ మనిషి తత్వం చూస్తే అసహ్యమేసింది. అయినా దిగమింగి 'చిత్రం' అని వెంటనడిచాడు.

రోజులు బరువుగా నడుస్తున్నాయి విరజాజికి. చేతిలో డబ్బులేదు. ఎవర్నడగాలన్నా, అంతంత మాత్రమే. తనింతవరకు నిలవేసింది ఏమీ లేదు. వెంకటసూరిపిన్ని చెప్పిన మాటలు నిజమనిపించాయి ఈ క్షణంలో తనకి. యిల్లు తనఖా పెడదామన్నా, అది బులిబాబుదొరగారు మాన్యంగా యిచ్చినది. అంతేగాని దానికి పత్రాలూ పాడూ ఏమీ తనదగ్గరలేవు. పైగా ఆ తతంగమంతా తనకి తెలియదు. రోజురోజుకి తనేదో బరువు మోస్తున్నట్టు ఆయాసం, అలసట పెరుగుతోంది. రోజు గడవడం కష్టంగా వుంది. నారిగాడిని బతిమాలి ముత్యాలపువ్వుంగరం అమ్మిస్తే యీ పదిహేనురోజులూ గడిచాయి. యింకో నెలరోజుల్లో పురుడు రావచ్చంది వెంకటసూరి. చేతిలో కానీలేదు. ఏమీ పాలుపోవడంలేదు తనకి. కోపం తగ్గి ఆయన తిరిగివస్తాడన్న ఆశకూడా సన్నగిల్లిపోయింది తనకి. దిగాలు పడి గుమ్మంలో కూర్చుంది సాయంత్రప్పువేళ. చినుకు గాలిగా వుంది. ఈదురుగాలి వీస్తోంది. చీకటి నెమ్మదిగా పేరుకుంటోంది.

'యిరజాజీ !' అంటూ లోపలికొచ్చాడు అంజయ్య.

'అవతల సినుకు గాలిగా ఉంది. తలుపులు తీసుక్కూకున్నావెందుకే యీ వోనలో జేరాలొస్తాయనే,' అన్నాడు.

'అందుకోసం కాదండీ. ఆయనకి కోపంతగ్గి వస్తారేమోననండి.'

'నీ మొకం. యింకెందుకొస్తాడే నెలలు నిండిన సాని కాడకి ఏ సరసుడొస్తాడే? నేనెంతమందిని సూడ్లేదూ. పోనీలేగాని, డబ్బేవన్నా కావాలేటి ?' అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

'దేప్పుడిలా వచ్చారు. మీకు నేనే కబురంపు దామనుకుంటున్నాను. నిన్నటి నుంచి యింట్లో ఏమీ లేవు. ఈ నెల గడిచి ఈ పురుడు వెళ్ళా

లంటే రెండొందలైనా కావాలి. మీరప్పిస్తే వట్టినే యిచ్చినంత పుణ్యం, చచ్చి మీ కడుపున పుడతాను.'

'అది కల్లోమాట. నీఅంత అందమైంది నా కడుపున ఎట్టా పుడతాదిలేగాని, డబ్బు కావాలన్నావు కనుక యిస్తాను. అందరికీ రూపాయకి పావలా వడ్డీ. నీది పెదమొత్తం కాబట్టి నూటికి యిరవయ్యే.'

'మీ రుణం చచ్చేలోపున ఏదోవిధంగా తీర్చుకుంటాను. యీ విరజాజి ఎప్పుడు యిలాగే ఉండిపోదులెండి. నాకూ బుద్ధొచ్చింది. కాస్త వొళ్ళారితే ఒక్క నెలలో తీర్చేస్తాను మీబాకి' అంది విరజాజి.

'అది సరేలే తీర్చేస్తావు. అదెప్పటి సంగతో! యిప్పటి మాటేటి మరి' అన్నాడు చేతులు నలుపుతూ పళ్ళన్నీ బయట పెట్టి.

'యిప్పటి సంగతేమిటి?'

'అరే! ఎరగనట్టడుగుతా వేటి? నాకసలే యిలాటి యిసయాలంటె సిగ్గు ముంచుకొచ్చేత్తది.—నేనెవరికప్పిచ్చినా యీ యీధిలోనే సుమా,— మామూలు లేకుండా ఎవ్వరికీ యివ్వలేదు.'

విరజాజికి అర్థమైంది. నవ్వి 'దానిదేముందిలెండి. నేనెక్కడికి పారిపోతాను. యిప్పుడు మీకు మాత్రం యేం సుఖం? యీ బరువు దిగిపోయాక ముందు మీతరవాతే మరెవరైనా' అంది విరజాజి.

'అబ్బెబ్బే. అదేమీ లాబంలేదు. ఈ వాయిదాలు నే తట్టుకోలేను సుమా. నీకు కన్నెరికం అయినకాడనుంచి లొట్ట లేత్తున్నాను. ఎప్పటి కప్పుడే గుమ్మంలోకి అడుగెడతానికి యీలులేని సరసుడే. ఏదో యిన్నాళ్ళకి కుదిరింది. యీ రాత్రి ఆ మామూలు తీర్చేత్తే, శుక్రారం పొద్దెల్లి పోదీ. పొద్దున్నే వడ్డీపోను నూటఅరవై రూపాయలూ పట్టు కొచ్చి యిచ్చేత్తాను.'

'నాకిప్పుడు ఓపికలేదు. మీకు నమస్కారం చేస్తాను. మీ కోరిక తీర్చేదాకా నే చావను. నామాట నమ్మండి.' అని బతిమిలాడుకుంది విరజాజి.

'అయితే డబ్బిత్తం కుదరదు. పద్దతంటే పద్దతే.' మొండికేసాడు అంజయ్య.

'అంతేనంటారా!' అంది విరజాజి భయంగా.

ఎదురుగా దున్నదుంగలా, మనుషుల్ని తినేవాడిలా అగుపించాడు విరజాజికి.

'అంతేమరి, రాత్రంతా వద్దులే. ఏదోకాసేపు. అంతే.' అంటూ తలుపేసివచ్చి విరజాజిని మంచం దగ్గరకు నెట్టుకెళ్ళాడు.

ఆ క్షణంలో అతను రెచ్చిపోయిన ఆబోతు. వళ్ళూపై తెలియ కుండా, ఆమెను నలిపి నుగ్గుచేసి ఎన్నాళ్ళబట్టో తనలో కరుడు గట్టిన కోరికను పశువులా తీర్చుకుంటున్నాడు. ఆమె నరాలను బిగ బట్టి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆ క్రౌర్యాన్ని సహించడానికి ప్రయత్ని స్తోంది. ఆ బాధ మొఖంలో అగుపించేకొద్దీ, అంజయ్య మరీ రెచ్చిపోయి పశువై పోతున్నాడు. పళ్ళుబిగించి, సహించి యింక బరువును, ఆ పశు బలాన్ని తట్టుకోలేక కడుపు ముద్దయిపోతూవుంటె కెవ్వున అరచింది.

ఆ అరుపుకి ఆబోతు మరీ రెచ్చిపోయింది. విరజాజి సొమ్మసిల్లి పోయింది. ఆబోతు తలుపు తెరుచుకుని 'పొద్దున్నే పంపుతా డబ్బు' అని గాలికిచెప్పి వెళ్ళి పోయింది.

ఆ అరుపువిని యింటి ముందుకొచ్చిన నారిగాడు, అంజయ్య బయటపడగానే లోపలికెళ్ళి చూశాడు. విరజాజి నిర్జీవంగా వాడిపోయిన తోటకూరకాడలా మంచంమీద పడుంది. పరుగెత్తికెళ్ళి వెంకటసూరిని పిలుచుకొచ్చాడు. వెంకటసూరివచ్చి పరీక్షగాచూసి ముఖంమీద నీళ్ళు చల్లింది.

'ఒరేయ్. ధర్మకర్త గార్నడిగి బండి తీసుకురారా, పట్నానికి తీసుకెళ్ళి ఆసుపత్రిలో చేర్పిస్తేగాని బతికేలా లేదు. ఊరికే రక్తం పోతోందిరా. లోపలి శిశువు దెబ్బతిందో ఏమో. త్వరగావెళ్ళిరా' అని వెంకటసూరి నారిగాడ్ని తొందర చేసింది.

నారిగాడు ఒక్క పరుగులో ధర్మకర్తగారింటి కెళ్ళి ఆయిన్నిలేపి సంగతి చెప్పి బండడిగాడు.

నిద్దరకళ్ళనున్న ధర్మకర్తకి ఆవార్త చీమకుట్టినట్టుకూడా అనిపించలేదు.

'అర్ధరాత్రివేళ బండి ఎక్కడనుంచి వస్తుందిరా: ఎడ్లు, బండి పొలంలో వున్నాయి. మంచం సవారి కట్టి తీసుకుపొండి.' అని నారిగాడు చెప్పబోతున్న మాట వినకుండా తలుపులు వేసుకుని లోపలికెళ్ళి పోయాడు ధర్మకర్త.

నారిగాడికి ఏమీతోచక కాళ్ళీడ్చుకొంటూ యింటికి తిరిగి వచ్చాడు. అప్పటికే విరజాజిని బయటపెట్టేరు.

సుబ్బారావు, పట్నంలోవున్న విరజాజి పిన్నికి యీ వార్త చెప్పడానికి వెళ్ళాడు. పట్నంలో వున్న సూర్జాన్‌కి కూడా యీ వార్త తెలిసింది.

తెల్లవారింది. అంత్యక్రియలు జరిపించాలి.

అంతా చేరారు, అందరిలో చిట్టిబాబు లేడు. అంజయ్యా లేడు. కన్నెరికం చేసిన పంతులూలేడు. విరజాజిని అనుభవించిన యితర సరసులూ లేరు. జీవితాన్ని అంకితం అందుకొని సేవలందుకున్న వేణుగోపాలుడు గుడిలోంచి బయటికిరాడు. దేవుడిచాటున అడపా దడపా సేవలందుకున్న ధర్మకర్త రాలేదు.

చేరిన వాళ్ళంతా సాటివాళ్ళు. వాళ్ళలో మనసున్న సూర్జాన్ వాచీ అమ్మి డబ్బు చేతపట్టుకుని సిద్ధంగా నిలబడ్డాడు.

మిగతా వాళ్ళంతా పరిమళాలు పీల్చుకొని కలుషపు గాలిని నిశ్వసించితే కాలుష్యాన్ని పీల్చి గుండెలో పరిమళింపజేసుకున్న వాడొక్కడే ఉన్నాడు, అక్కడి వాళ్ళలో సూర్జాన్.